క్లుప్తంగా

ఎస్సై బాధ్యతల స్వీకరణ


ఎస్సై రంగనాథ్‌గౌడ్

వింజమూరు : వింజమూరు నూతన ఎస్సైగా వై.రంగనాథ్‌గౌడ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న జంపాని కుమార్‌ను వీఆర్‌కు బదిలీ చేశారు. ప్రస్తుత ఎస్సై రంగనాథ్‌గౌడ్ 2004వ బ్యాచ్‌కు చెందిన సీనియర్ సబ్ ఇన్‌స్పెక్టర్. ఆయన గుంటూరు జిల్లాలో పదేళ్ల పాటు వివిధ పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహించారు. జిల్లాలో సోమశిల, సంగం, చేజర్ల పోలీస్‌స్టేషన్లలో పనిచేశారు. ప్రస్తుతం నెల్లూరు ట్రాఫిక్ విభాగంలో పనిచేస్తూ వింజమూరుకు బదిలీ అయ్యారు.

విజేతల స్ఫూర్తితో సాగాలి

ఆత్మకూరురూరల్ : బీఆర్ అంబేడ్కర్, ఏపీజే అబ్దుల్ కలాం తదితర విజేతల స్ఫూర్తితో ముందుకు సాగాలని విశ్రాంత ఉపాధ్యాయుడు వెలిశెట్టి నారాయణరావు పేర్కొన్నారు. మండలంలోని మహిమలూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు శనివారం ఆయన మోటివేషన్ క్లాసులు నిర్వహించారు. పరీక్షల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. నారాయణరావు 86వ క్లాస్ నిర్వహించడం పట్ల ఉపాధ్యాయులు ఆయన్ను సత్కరించారు.

పరీక్ష సామగ్రి వితరణ



అల్లూరు : మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు గోగులపల్లి గ్రామానికి చెందిన పురిణి మస్తాన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్యాడ్లు, పెన్నులను శనివారం పంపిణీ చేశారు. ఎంపీపీ శశిరేఖ, ఎంఈఓ నాగేశ్వర్, ఏఎంసీ వైస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి చేతులమీదుగా 300 మంది విద్యార్థులకు సామగ్రిని అందించారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణారెడ్డి, రమేష్, భాస్కర్, శ్రీనివాసులరెడ్డి, హెచ్‌ఎం చెంచయ్య పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



వరికుంటపాడు : స్థానిక బస్టాండ్ సెంటర్‌లో సర్పంచ్ కె.దిలీప్‌కుమార్, ఆటో యూనియన్ల వారు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎస్సై బాలమహేంద్రనాయక్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి దృష్ట్యా చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ, ఎస్సైలు

ఉదయగిరి : వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలని సీఐ వి.గిరిబాబు, ఎస్సై ఎన్.ప్రభాకర్ పేర్కొన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఎదురుగా వారు శనివారం వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వాహనదారుల ధ్రువపత్రాలను పరిశీలించి సక్రమంగా లేనివారికి జరిమానా విధించారు. అనంతరం మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలను నడపాలన్నారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

మామిడి రైతులకు సూచనలు

బిట్రగుంట : ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని మామిడి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మండలంలోని జువ్వలదిన్నె గ్రామంలో ఉద్యానవన శాఖ అధికారి సుధామయి శనివారం పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న అకాల వర్షాలు, ఈదురు గాలులకు మామిడి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వీటిపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం పూత, పిందె, కాయలపై మంగు మచ్చలు తదితర వాటిలో రైతులు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

వింజమూరు : మండలంలోని శంఖవరంలో పాతకక్షల నేపథ్యంలో రెండు వర్గాల మధ్య శుక్రవారం జరిగిన ఘర్షణలో ఇరువర్గాలకు చెందిన 38 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రంగనాథ్‌గౌడ్ శనివారం తెలిపారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ పికెట్ ఏర్పాటు చేశామన్నారు. కాగా సీఐ సాంబశివరావు శంకవరానికి వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. ఇరువర్గాలతో మాట్లాడి చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రస్తుతం గ్రామంలో ప్రశాంత వాతావరణం నెలకొంది.

సంక్షేమ పథకాలతో ఆర్థిక భరోసా

- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి
- మెప్మా, వైఎస్సార్‌కేపీ ఆధ్వర్యంలో ఆసరా సంబరాలు


వెలుగు కార్యాలయంలో ఆసరా నమూనా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరు : వైఎస్సార్ ఆసరా, అమ్మఒడి, సున్నా వడ్డీ, చేయూత తదితర సంక్షేమ పథకాలతో మహిళలకు ఆర్థిక భరోసా కల్పించి వారి గౌరవాన్ని పెంచిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. ఆత్మకూరు పట్టణంలో మెప్మా, వైఎస్సార్‌కేపీల ఆధ్వర్యంలో శనివారం ఆసరా సంబరాలను వేర్వేరుగా నిర్వహించారు. తొలుత ఆయా కార్యాలయాల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పొదుపు మహిళలతో కలిసి పాలాభిషేకాలు చేశారు. అనంతరం జరిగిన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందితే రాష్ట్రం బాగుంటుందన్న ఆలోచనతో ఇచ్చిన హామీ మేరకు ఇప్పటికే మూడు విడతలుగా పొదుపు మహిళలకు నగదు అందజేశారన్నారు. మెప్మా ఆధ్వర్యంలో 439 పొదుపు సంఘాల్లో ఉన్న 4,195 మందికి రూ.3.52 కోట్ల నగదు వారి వ్యక్తిగత ఖాతాల్లో జమ కానుందని ఆయన తెలిపారు. ఈ మేరకు నమూనా చెక్కును పట్టణ సమాఖ్య అధ్యక్షురాలు గంధళ్ల లక్ష్మికి అందజేశారు.

వైఎస్సార్‌కేపీ కార్యాలయంలో..

వైఎస్సార్‌కేపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో 4,906 మంది పొదుపు సభ్యులకు రూ.3.25 కోట్ల నగదు వారి ఖాతాల్లో జమ కానుందని ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి తెలిపారు. ఆ మేరకు నమూనా చెక్కును అందజేశారు. మెప్మా ఆధ్వర్యంలోని పొదుపు మహిళలకు మూడు విడతలుగా రూ.10 కోట్లకుపైగా పొదుపు రుణమాఫీ జరగ్గా వైఎస్సార్ కేపీ ఆధ్వర్యంలోని పొదుపు సంఘాలకు రూ.9.75 కోట్లు మూడు విడతలుగా జమ అయిందని వివరించారు. అన్నివర్గాలకు మేలు చేస్తున్న వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ప్రజలు మరోసారి పట్టం కట్టాలని కోరారు. కార్యక్రమంలో మెప్మా పీడీ డి.రవీంద్ర, డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, ఆర్డీఓ సాధు కరుణ కుమారి, కమిషనర్ ఎం.రమేష్ బాబు, మెప్మా సీఎంఎం అంకయ్య, సీఓ మాధవి, ఐకేపీ ఏసీ వెంకటేశ్వర్లు, ఏపీఎం బి.వెంకమ్మ, ఆర్‌పీలు, సీసీలు, మున్సిపల్ చైర్‌పర్సన్ గోపారం వెంకట రమణమ్మ, డాక్టర్ కేవీ శ్రావణ్‌కుమార్, షేక్ సర్దార్, ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీడీఓ సీహెచ్ శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, ఐవీ రమణారెడ్డి, ఎస్సీసెల్ అధ్యక్షుడు కొండా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న పొదుపు సంఘాల మహిళలు

ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు


మహిళకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి : వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కావలి రూరల్ మండలంలోని రుద్రకోట గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి వారికి అందిన సంక్షేమ పథకాల గురించి వివరించి బుక్‌లెట్‌ను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన దానికంటే మిన్నగా పేదలకు సంక్షేమ పథకాలను అందిస్తున్నట్లు వెల్లడించారు. దీనివల్ల ప్రతి గడపలో ప్రజల నుంచి విశేషాదరణ లభిస్తోందని తెలిపారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగితే మాకు జగనన్న అండ ఉంటే సమస్యలు ఎందుకు ఉంటాయని, ప్రస్తుతం మా పిల్లలు కూడా పనులకు వెళ్లకుండా చక్కగా పాఠశాలలకు వెళ్తున్నట్లు ప్రజలు ఆనందంతో చెబుతున్నట్లు వివరించారు. నియోజకవర్గంలోని ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని తెలిపారు. గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల పెత్తనంతో పేదలకు న్యాయం జరిగేది కాదని, అయితే ప్రస్తుతం ఉన్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందుతున్నట్లు తెలియజేశారు. ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే శ్రమ లేకుండా గ్రామ సచివాలయ వ్యవస్థ గొప్పగా పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. అన్నివర్గాలకు మేలు చేయడమే ఈ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు, పలు శాఖల అధికారులు, వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

చిరుధాన్యాల్లో పోషకాలు


అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్

చేజర్ల : చిరుధాన్యాల్లో పుష్కలంగా పౌష్టికాహారం లభిస్తాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుబ్బరత్నమ్మ తెలిపారు. మండలంలోని రెడ్డివారికండ్రిక అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన పోషణ్ పక్వాడ కార్యక్రమంలో శనివారం ఆమె పాల్గొన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ప్రతిరోజూ చిరుధాన్యాలతో కూడిన ఆహారం తీసువాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు రాజ్యలక్ష్మి, పెంచల లక్ష్మమ్మ, శ్యామల, కామాక్షి పాల్గొన్నారు.

- అల్లూరు : స్థానిక వినాయక నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిరుధ్యాన్యాల వినియోగంపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎ.రాజేశ్వరి అవగాహన కల్పించారు.

పోలేరమ్మకు పూజలు



సోమశిల : సోమశిలలోని పోలేరమ్మ తల్లి జాతర మహోత్సవంలో భాగంగా అమ్మవారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, జెడ్పీటీసీ సభ్యుడు రాపూరు వెంకటసుబ్బారెడ్డి పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ ఉన్నారు.

టీకాల పరిశీలన



మర్రిపాడు : మండలంలోని పోలిరెడ్డిపల్లిలో ఉన్న వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్‌లో వ్యాధి నిరోధక టీకాలను కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రోజిలిన్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రస్తుతం ఎండలు అధికంగా ఉండడంతో వడదెబ్బ తగిలే అవకాశం ఉందని, తాగునీటిని వెంట ఉంచుకోవాలని సూచించారు. ఆమె వెంట హెల్త్ అసిస్టెంట్ ఖాజామునుబారక్, ఏఎన్ఎం సుప్రియ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చెట్టును ఢీకొన్న కారు


ప్రమాదానికి గురైన కారు

చేజర్ల : మండలంలోని చిత్తలూరు గ్రామం వద్ద శనివారం ఓ కారు ప్రమాదానికి గురైంది. నెల్లూరుకు చెందిన వారు మడపల్లి గ్రామంలోని ఓ కార్యక్రమానికి హాజరై తిరిగి నెల్లూరుకు వెళ్తుండగా చిత్తలూరు కాలనీ వద్ద కారు అదుపుతప్పి తాటి చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ఉన్నవారికి స్వల్ప గాయాలయ్యాయి. కారు ముందుభాగం దెబ్బతింది. ఘటనా స్థలాన్ని ఎస్సై మరిడి నాయుడు పరిశీలించారు.

లో ఓల్టేజీ సమస్యను పరిష్కరించండి

ఉదయగిరి : పట్టణంలోని షబ్బీర్ కాలనీలో లో ఓల్టేజీ విద్యుత్ సమస్యను పరిష్కరించాలని పలువురు కాలనీ వాసులు శనివారం ట్రాన్స్‌కో ఏఈ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా లోఓల్టేజీ సమస్య వేధిస్తోందన్నారు. అధికారులు స్పందించాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక డ్రైవ్

- ఆర్డీఓ సాధు కరుణకుమారి


రైతులు, నాయకులతో మాట్లాడుతున్న ఆర్డీఓ

ఆత్మకూరు : ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలోని రెవెన్యూ, భూ సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి నేతృత్వంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నట్లు ఆర్డీఓ సాధు కరుణకుమారి అన్నారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో మర్రిపాడు, ఏఎస్‌పేట మండలాలకు చెందిన రైతులు, వైఎస్సార్‌సీపీ నేతలు శనివారం ఆమెను కలిసి పలు సమస్యలను విన్నవించుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈనెల 11వ తేదీ మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో అన్ని మండలాల రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే సమావేశంలో సమస్యలపై చర్చించి పరిష్కారం చేయనున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ ఏఓ మధుసూదన్‌రావు, సిబ్బంది ఉన్నారు.

ఆర్‌ఎస్సార్‌లో ప్రాంగణ ఎంపికలు


ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో అధ్యాపకులు

బిట్రగుంట : బోగోలు మండలం, కడనూతలలోని రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో హెచ్‌సీఎల్ సంస్థలో నెట్‌వర్క్ అనలిస్ట్ ఉద్యోగాల కోసం పాత్ క్రియేటర్స్ సొల్యూషన్స్ సంస్థ శనివారం ప్రాంగణ ఎంపికలు నిర్వహించింది. సంస్థ ప్రతినిధులు నవనీతం రాజమణి, శ్యామల ఆధ్వర్యంలో విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. కళాశాలకు చెందిన 135 మంది విద్యార్థులు హాజరవగా రాత పరీక్షలు, మౌఖిక పరీక్షల అనంతరం 30 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరికి వార్షిక వేతనం రూ.2.5లక్షల నుంచి రూ.3.5లక్షల వరకు ఉంటుందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పీవీఎస్ రెడ్డి, డైరెక్ట్ డాక్టర్ కె.రాజారెడ్డి, ఏవీ ఆర్వీ రమణారెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ నేతల భూ కబ్జాలను అరికట్టండి

- దేవుడి భూములను కాపాడండి


మాట్లాడుతున్న ముస్లిం మత పెద్దలు

కావలి రూరల్ : నియోజకవర్గంలో టీడీపీ నేతల భూ కబ్జాలను అరికట్టాలని, దేవుడి భూములను కాపాడాలని జిల్లా వక్ఫ్‌బోర్డు అధ్యక్షుడు ఎస్‌కే మీరా మొహిద్దీన్ తెలిపారు. పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ముస్లిం మత పెద్దలు శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో మసీదు మాన్యాలు, పీర్ల చావడి మాన్యాలను కొందరు టీడీపీ నేతలు ఆక్రమించుకుని అక్రమ రిజిస్ట్రేషన్ ద్వారా విక్రయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కావలి నడిబొడ్డున దాదాపు రూ.4 కోట్ల విలువైన దేవుడి స్థలాన్ని టీడీపీ నేతలు వారి కటుంబ సభ్యుల పేరున నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి విక్రయించారన్నారు. దీనిపై ఏపీ వక్ఫ్‌బోర్డుతో పాటు కలెక్టర్ దృష్టి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో వక్ఫ్ జిల్లా మెంబర్లు షఫీఉల్లా, దస్తగిరి బాషా తదితరులు పాల్గొన్నారు.

వైభోగం.. స్వామివారి గ్రామోత్సవం


ఆత్మకూరు రూరల్ : స్వామివారికి పవళింపు సేవ


ఆత్మకూరు రూరల్ : అశ్వవాహనంలో సీతారామ లక్ష్మణుల గ్రామోత్సవం

ఆత్మకూరురూరల్ : మండలంలోని గండ్లవేడు, నాగులపాడు, చెర్లోయడవల్లి, బండారుపల్లి తదితర గ్రామాల్లో శ్రీరామనవమి ఉత్సవాలు శనివారం వైభవంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో అశ్వ, గరుడ, గజ, హనుమంత తదితర వాహనాల్లో సీతారామ, లక్ష్మణుల మూలమూర్తులను విశేష పుష్పాలంకరణతో గ్రామోత్సవాలు గావించారు. గండ్లవేడులో కొల్లివారి ఉభయం సందర్భంగా స్వామి, అమ్మవార్లకు పవళింపు సేవ, అశ్వ వాహన సేవలు కోలాహలంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సీతారాముల కల్యాణం, వాహన సేవల్లో పాల్గొని నైవేద్యాలు సమర్పించారు.

పొన్నచెట్టు వాహనంపై..

వరికుంటపాడు : వరికుంటపాడులోని కోదండరామ స్వామి ఆలయంలో శ్రీరామనవమి ఉత్సవాల సందర్భంగా శనివారం స్వామివార్లను పొన్నచెట్టు వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

శ్రీరామునికి హనుమంత సేవ

చేజర్ల : శ్రీరామనవమి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మండలంలోని నాగులవెలటూరులో శుక్రవారం రాత్రి హనుమంత వాహనంపై శ్రీరాముడు భక్తులకు దర్శనమిచ్చారు. కాగా శనివారం ఉదయం రామాలయంలో విశేషాభిషేకాలు, పూజా కార్యక్రమాలు జరిగాయి. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. నేడు కల్యాణం, 3న రథోత్సవం జరుగుతుందని ఆలయ కమిటీ చైర్మన్ పోలిశెట్టి రమణయ్య గుప్త తెలిపారు. చుట్టుపక్కల ప్రాంతాల వారు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.


వరికుంటపాడులో..


చేజర్ల : హనుమంత వాహనంపై శ్రీరాముడు

ఎన్‌డీసీసీబీ అసిస్టెంట్ మేనేజర్ మృతి


అఖిల్‌రెడ్డి(ఫైల్)

ఆత్మకూరు : పట్టణంలోని కేంద్ర సహకార బ్యాంక్ (ఎన్‌డీసీసీబీ) అసిస్టెంట్ మేనేజర్ బొయిళ్ల సాయిఅఖిల్‌రెడ్డి (29) గుండెపోటుతో శనివారం రాత్రి మృతిచెందారు. అవివాహితుడైన అఖిల్‌రెడ్డి గతేడాది మార్చిలో ఆత్మకూరు కోఆపరేటివ్ బ్యాంక్‌కు అసిస్టెంట్ మేనేజర్‌గా బదిలీపై వచ్చారు. గత కొద్దిరోజులుగా అనారోగ్య కారణాలతో సెలవు తీసుకుని ఇంటి వద్దనే చికిత్స పొందుతున్నారు. కాగా శనివారం సాయంత్రం ఒక్కసారిగా గుండెపోటు రావడంతో ఆత్మకూరులోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతుడి తల్లి మాలిని అనంతసాగరం మండలంలో ప్రభుత్వ ఉపాధ్యాయిని కాగా, తండ్రి తిరుపతిరెడ్డి పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో కాంట్రాక్ట్ అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలని నిరసన

జలదంకి : తమ ధాన్యాన్ని కొనుగోలు చేయాలంటూ మండలంలోని కమ్మవారిపాళెంలో రైతులు శనివారం నిరసన చేపట్టారు. గ్రామంలోని ఆర్బీకే, సచివాలయాలను మూసివేయించి, పురుగు మందు డబ్బాలతో రైతుల కష్టాలు తీర్చాలని నినాదాలు చేశారు. ఈ విషయం జిల్లా పౌరసరఫరాల శాఖ డీఎం వెంకటేశ్వర్లు దృష్టికి వెళ్లడంతో ఆయన వెంటనే కమ్మవారిపాళేనికి చేరుకుని రైతులతో మాట్లాడారు. గ్రామంలోని ప్రతి రైతు వద్ద ధాన్యాన్ని కొనుగోలు చేయిస్తానని వారికి హామీ ఇచ్చారు. దీంతో గ్రామంలోని రైతులు తమ నిరసనను విరమించారు.

ఆగ'మేఘాలు'


నాగులవరం సమీపంలో పట్టలు కప్పి భద్రపరిచిన ధాన్యపు రాసులు

బిట్రగుంట: బోగోలు మండలంలో శనివారం సాయంత్రం ఆకాశంలో దట్టమైన మేఘాలు ఒక్కసారిగా కమ్ముకున్నాయి. మధ్యాహ్నం నుంచే చల్లటి గాలులతో వర్ష సూచన కనిపించడం, నల్లటి మేఘాలు కమ్ముకోవడంతో రైతులు ఆందోళన చెందారు. ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలో కోతకు వచ్చిన వరిపంట భారీగా దెబ్బతింది. 500 ఎకరాలకు పైగా రైతులు పంట నష్టపోయారు. తాజాగా మరోమారు మేఘాలు కమ్ముకోవడంతో రైతులు ధాన్యాన్ని భద్రపరుచుకునేందుకు పట్టల కోసం పరుగులు తీశారు. కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని పట్టలు కప్పి జాగ్రత్త చేసుకునేందుకు తీవ్ర అవస్థలు పడ్డారు.

41,900 పశువులకు టీకాలు

వరికుంటపాడు : ఉదయగిరి, వరికుంటపాడు, సీతారామపురం, దుత్తలూరు మండలాల్లోని పశువైద్యశాలల పరిధిలో గాలికుంటు వ్యాధి సోకకుండా నాలుగు నెలలు పైబడిన 41,900 పశువులకు టీకాలు వేసినట్లు ఆయా మండలాల పశువైద్యాధికారులు శనివారం తెలిపారు. వరికుంటపాడు మండలంలో 19,600కు 18,000, ఉదయగిరిలో 10,050కు 7,500, సీతారామపురంలో 6,350కు 6,300, దుత్తలూరులో 9,700కు 10,100 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేసినట్లు వారు తెలిపారు.

90 శాతం ఇంటి పన్నుల వసూలు

ఆత్మకూరు : మున్సిపల్ పరిధిలో గడిచిన ఏడాదికిగాను 90 శాతం ఇంటి పన్నులు వసూలు అయినట్లు కమిషనర్ ఎం.రమేష్‌బాబు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సయ్యద్ ఖాసీం తెలిపారు. ఈ మేరకు శనివారం వారు మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో రూ.2.82 కోట్ల ఇంటి పన్నులు వసూలు కావాల్సి ఉందని, ప్రభుత్వం మార్చి 31లోపు కట్టిన వారికి వడ్డీ మాఫీ చేయడంతో రూ.2.54 కోట్లు వసూలు అయినట్లు తెలిపారు. అనంతరం వారు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.

మాదక ద్రవ్యాల నిరోధంపై అవగాహన

అల్లూరు : స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కోవూరు సెబ్ సీఐ నరహరిరావు ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నిరోధంపై సచివాలయ మహిళా పోలీసులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిషేధిత మత్తు పదార్థాలకు ప్రజలు దూరంగా ఉండే విధంగా సచివాలయ మహిళా పోలీసులు చూడాలని, వాటి విక్రయాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.